ప్రజల ఆరోగ్యం పట్టదా..?

- 9 నెలలుగా గోదాముల్లోనే జొన్నలు
- ఉపలోకాయుక్త దాడులతో రేషన్ షాపులకు
- పాడైపోయినా పంపిణీ చేస్తారా...
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం

8



అమ్మోరు.. వస్తుందని..!

- ఐదు మంగళవారాలు... ఊరంతా ఖాళీ
- జాతరకు ముందు ఆచారం
- అర్ధరాత్రి అమ్మవారు సంచరిస్తుందని నమ్మకం
- శిగ్గావి తాలూకా హోతనహళ్ళిలో సంప్రదాయం


ఇంటి దీపాలు ఇలా..


ట్రాక్టర్‌లో శివారుకు వెళ్తున్న గ్రామస్థులు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న సంప్రదాయాలను పాటించకుంటే కీడు జరుగుతుందనే అభిప్రాయాలు నేటికీ పల్లె ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. అటువంటి విధానాన్ని హావేరి జిల్లా శిగ్గావి తాలూకా హోతనహళ్ళి గ్రామంలో అమలు చేస్తున్నారు. ఐదు మంగళవారాలు ప్రజలంతా గ్రామాన్ని వీడి పంట పొలాల్లోనే ఉదయం నుంచి సాయంత్రం దాకా గడుపుతారు. ఊరికి వెళ్లే అన్ని మార్గాల్లోనూ ప్రవేశం నిషేధమనే బ్యానరుతోపాటు అడ్డుగా కట్టెలు, రాళ్లు అడ్డుగా వేస్తారు. ఇప్పటికే మూడు వారాలు ముగిసిన సంప్రదాయం నాల్గోవారానికి సిద్ధమవుతూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హోతనహళ్ళి గ్రామంలో మంగళవారం ఊరు వదలాలనేది కొన్నేళ్లుగా పాటిస్తున్నారు. గ్రామదేవత ఆగ్రహిస్తే ప్రజలందరికీ కష్టాలు వస్తాయని ఇక్కడివారు భావిస్తారు. గ్రామంలో మనుషులు ఎవరూ తిరగకపోతే గ్రామదేవత సంచరిస్తారని భావిస్తారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు గ్రామదేవతకు పూజలు చేస్తారు. ఆ తర్వాత గ్రామస్థులంతా ఒకరోజుకు అవసరమయ్యే సామగ్రిని తీసుకుని ఇళ్లకు తాళాలు వేసి పొలాలవైపు వెళ్తారు. సాయంత్రం దాకా అక్కడే గడుపుతారు. వంటలు వండుకోవడం, పశువులకు గ్రాసాన్ని సిద్ధం చేసుకుంటారు. సూర్యాస్తమయానికి గ్రామస్థులంతా ఊరి చివరకు చేరి ఒకేసారి ప్రవేశిస్తారు. గ్రామదేవత జాతరకు ముందు ఐదు మంగళవారాలు ఇలా పాటించాలనేది వీరి నమ్మకంగా ఉంది. జనవరి ఆఖరుకు జాతర నిర్వహించాలని ఖరారు కావడంతో ఈ విధానం కొనసాగిస్తున్నారు. ఇటీవల కొన్నేళ్లపాటు కరువు, కొవిడ్ వేళ జాతర జరగలేదు. అప్పట్లో గ్రామస్థులంతా సాధారణంగానే గడిపారు. ఇటీవల గ్రామంలోని కొందరు జాతర జరపాలని తీర్మానించారు. అందుకు అనుగుణంగానే ఊరి బయటకు వెళ్లే సంప్రదాయం పాటిస్తున్నారు. ఇతర గ్రామస్థులు, ఆర్టీసీ బస్సుతోపాటు వ్యాపారులు, స్థానికుల బంధువులకు ముందుగానే సమాచారం ఇస్తారు. అయినా గ్రామ శివారులో ఒకరిద్దరు వ్యక్తులు నిరంతరంగా కాపలా కాస్తారు. గ్రామంలో హిందువులు, ముస్లిం మతస్థులు కలిసి సంప్రదాయాన్ని పాటించడం విశేషం. వారు గ్రామ జాతర చేయకపోయినా స్థానికంగా చేపట్టే అన్ని విధానాలలో కలిసి ఉంటామని పలువురు అభిప్రాయపడ్డారు. 12ఏళ్ల తర్వాత జరుగుతున్న జాతర కావడంతో ఈ ఏడాది ఆడంబరంగా జరపాలని నిర్ణయించారు.


ప్రవేశం లేదంటూ గ్రామశివారులో ఫ్లెక్సీ ఏర్పాటు



అన్నం పెట్టిన మహనీయుడు

- పేదల ఆకలి తీర్చిన ఎన్టీఆర్
- పలు పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

8

ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న కమ్మసంఘం నాయకులు

బళ్లారి ఆసుపత్రి వద్ద



సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించింది..

ప్రియుడితో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య ఉదంతం హాసన్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల విచారణతో నిజాలు బయటపడ్డాయి.

7

కేంద్రం కోరుతున్నదిదే...

కేంద్ర అటవీమంత్రిత్వశాఖ ప్రాజెక్టు డీపీఆర్‌కు సంబంధించి స్థితిగతుల వివరాలను కోరింది. ప్రాజెక్టుకు సంబంధించి కోర్టులో కేసుల వివరాలను, ఆదేశాల నివేదిక ఇవ్వాలని కోరింది. రాష్ట్రప్రభుత్వం, కేంద్రజలశక్తి కమిషన్ డీపీఆర్‌ను కావేరి నీటి నిర్వహణా ప్రాధికార పరిశీలనకు పంపిందని 2024 ఫిబ్రవరి 1న డీపీఆర్‌ను వాపసు పంపారని వివరించింది. మేకెదాటు ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు బ్రేక్ పెట్టలేదని వివరించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లోనూ సమస్య పరిష్కారమైందన్నారు. సుప్రీంకోర్టుకు రాష్ట్రప్రభుత్వం నివేదిక ఇచ్చింది. జలశక్తి కమిషన్‌కు సమర్పించిన డీపీఆర్ ప్రకారం అంతర్రాష్ట్ర జలవివాదంగా ఉంది. కేంద్ర జలశక్తి కమిషన్ నీటి నిర్వహణబోర్డు డీపీఆర్‌కు అంగీకారం తెలిపింది. కావేరి వన్యజీవిధామలో ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. ఏనుగులు, పులుల కారిడార్ పరిధిలో ఉన్నందున అటవీ, పర్యావరణ, వన్యజీవి మండలి అనుమతులు పొందాల్సి ఉంది. డీపీఆర్ తిరస్కరించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం 2021లోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2022-23లో విచారణలు సాగాయి. 2023 సెప్టెంబరు 21న విచారణలను రెండువారాలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత విచారణలు జరగలేదని వివరించింది. ఇలాంటి కారణాలతో మేకెదాటు ప్రాజెక్టు ముందుకు కదలలేదు. ఇలా మేకెదాటుకు అడ్డంకులు తగులుతూనే ఉన్నాయి.


నగరంలో తాగునీటి కష్టాలు(ఫైల్)


మేకెదాటు ప్రవాహం

మరో గండం!

- మెకెదాటుకు మరో ముప్పు
- అటవీభూమిపై కేంద్రం అభ్యంతరం
- అడ్డు తగులుతున్న తమిళనాడు
- బెంగళూరుకు తప్పని తాగునీటి కష్టాలు
- డీపీఆర్ సిద్ధమైనా ముందుకు పడని అడుగులు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా రామనగర జిల్లా కనకపుర తాలూకాలోని మేకెదాటు వద్ద నిర్మించదలిచిన ప్రాజెక్టుకు మరో గండం అడ్డు వచ్చింది. ప్రపంచంలోనే వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు నగరానికి దేశ విదేశాలనుంచి వలసలతోపాటు శాశ్వత నివాసానికి ఏటా వస్తుంటారు. ఇలా కొన్నేళ్ల వ్యవధిలోనే నగరానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతుండడంతో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలని శాశ్వతంగా సమకూర్చాలని కొన్నేళ్లకాలంగా మేకెదాటు ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కొడగు జిల్లా తలకావేరిలో ఉద్భవించే కావేరి నది రాష్ట్రం నుంచి తమిళనాడు మీదుగా పుదుచ్చేరి దాకా సాగుతుంది. కావేరినదికి అనుబంధంగా రాష్ట్ర పరిధిలో హేమావతి, కబిని, హారంగితోపాటు మండ్య జిల్లాలో కృష్ణరాజ సాగర్ (కేఆర్ఎస్) జలాశయాలు ఉన్నాయి. కేఆర్ఎస్ నుంచి తమిళనాడుకు వెళ్తుంది. ఏటా వందలాది టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. వృథా నీటిని సద్వినియోగం చేసుకునేలా రామనగర జిల్లా కనకపుర తాలూకా మేకెదాటు వద్ద భారీ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా బెంగళూరు నగరంతోపాటు గ్రామీణ జిల్లాకు శాశ్వతంగా తాగునీరు సమకూర్చడంతోపాటు జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రయత్నిస్తున్నారు.

డీపీఆర్ సిద్ధమైనా..

ప్రాజెక్టు నిర్మాణం కోసం 2019లో అప్పటి కేంద్రప్రభుత్వం జల వనరుల మంత్రిత్వశాఖ కోరిన మేరకు 9వేల కోట్ల రూపాయలతో డీపీఆర్‌ను సిద్ధం చేశారు. 67 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని అంచనా వేశారు. 190 హెక్టార్ల రెవెన్యూ భూమితోపాటు 5,077 హెక్టార్ల అటవీభూమి అవసరం కానుంది. 5 గ్రామాలు ముంపునకు గురవుతాయి. 221 కుటుంబీకులకు పునరావాసం కల్పించాల్సి ఉంది.

డీపీఆర్ పూర్తి అయినా ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉందని, అయినా జాప్యం చేస్తున్నారని 2022 జనవరిలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ భారీగా నిరసన పాదయాత్ర చేపట్టింది. మేకెదాటు నుంచి బెంగళూరు వరకు రోజూ వేలాదిమందితో పాదయాత్ర జరిపారు. కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించారని రామనగరలో పోలీసులు అడ్డుకున్నారు. తాత్కాలికంగా పాదయాత్ర నిలిపివేసి ఫిబ్రవరిలో రామనగర నుంచి బెంగళూరు దాకా యాత్ర కొనసాగించారు. ఇటీవల ఏడాదిన్నర కాలంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేకెదాటు ప్రాజెక్టుపై సమగ్రమైన అనుమతులు సాధించలేకపోయారు. నాడు ప్రతిపక్షంలో పోరాడినా, నేడు అధికారం ఉన్నా వృథాగానే మారింది.


2022 మేకెదాటు ప్రాజెక్టు పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

అటవీ భూమితోనే సమస్యలు..

మేకెదాటు ప్రాజెక్టు నిర్మించేందుకు 5200 హెక్టార్లు (12,692 ఎకరాల) అటవీభూమిని సద్వినియోగం చేసుకునేలా రాష్ట్రప్రభుత్వం కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖకు వినతి పంపింది. సదరు ప్రస్తావనను కేంద్ర అటవీశాఖ పరిశీలించాల్సి ఉండేది. అయితే జాబితానుంచి ఈ ప్రస్తావనను తొలగించారు. దీంతో రాష్ట్రప్రభుత్వానికి ప్రారంభంలోనే అడ్డంకి ఏర్పడినట్లయ్యింది. ఎటువంటి ప్రాజెక్టుకు అనుమతులు లభించాలన్నా ముందుగా ప్రాజెక్టు లక్ష్యం, ఆ పరిధిలో పాటించాల్సిన నిబంధనలకు అంగీకారం ఉండాలి. కర్ణాటక ప్రభుత్వం అనుమతులకోసం 2019 జూన్‌లోనే ప్రస్తావనలు పంపింది. 2022 సెప్టెంబరులోనే అభ్యంతరాలు తలెత్తాయి. అంతర్రాష్ట్ర జల వివాదం అంశం కావడంతో కావేరి నీటి నిర్వహణా ప్రాధికార అంగీకారం లభించిన తర్వాతనే నిబంధనలకు అనుమతులు ఇస్తామని అటవీ, పర్యావరణశాఖ స్పష్టం చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2024 మే 29న మరోసారి ప్రస్తావనలు పంపింది. వివాదం సుప్రీంకోర్టులో ఉన్నందున జలశక్తి మంత్రిత్వ కార్యాలయం వివరణ కోరింది. సుప్రీంకోర్టు బ్రేక్ పెట్టలేదని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. అటవీశాఖ అభ్యంతరంతో వెనుకడుగు అయ్యింది.

తమిళనాడు అభ్యంతరాలు

కావేరి నది కర్ణాటక మీదుగా తమిళనాడుకు ప్రవహిస్తున్నందున మేకెదాటు నిర్మిస్తే తమకు అన్యాయం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. కేంద్రం డీపీఆర్ కోరినప్పుడే ఏకంగా తమిళనాడు బంద్ చేయడంతోపాటు పలు విధాలా నిరసనలు తెలిపారు. అక్కడ పార్టీలతో సంబంధం లేకుండా సమిష్టిగా మేకెదాటును అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. కర్ణాటకపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అడగకపోయినా అన్నీ ఇచ్చాం..

- రాష్ట్రానికే అధిక గ్రాంట్లు
- కర్ణాటకపై ఎలాంటి వివక్ష లేదు
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


కేంద్రమంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాష్ట్ర మంత్రుల బృందం

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం అడగకపోయినా కేంద్రం నుంచి అత్యధిక గ్రాంట్లను విడుదల చేశామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, పేదలకు పక్కాఇళ్ల వంటి పథకాలలో రాష్ట్రానికి అధిక గ్రాంట్లు ఇచ్చామన్నారు. కర్ణాటక వికాసానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని ప్రతి నిరుపేదకు సొంతింటి కల సాకారం చేయాలనేది ప్రధానమంత్రి ఆశయమన్నారు. కర్ణాటకపై ఎలాంటి వివక్ష లేదన్నారు. ఇటీవలి సెప్టెంబరులో కర్ణాటకకు 2,57,256 ఇళ్ల నిర్మాణానికి గ్రాంటు కేటాయించామన్నారు. ప్రస్తుతం అదనంగా 4,67,580 ఇళ్లకు అంగీకరించామన్నారు. గతంలో కేటాయించిన గ్రాంట్లు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించామన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కారించాలని రాష్ట్రప్రభుత్వం కోరిందన్నారు. అందుకే రూ.97కోట్లు విడుదల చేశామన్నారు. రాష్ట్రమంత్రులు కృష్ణబైరేగౌడ, చలువరాయస్వామి, ప్రియాంకఖర్గేలు కొన్ని ప్రతిపాదనలు ఉంచారని వాటిని పరిష్కరించేందుకు కట్టుబడ్డామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక త్వరలోనే ప్రక్రియ ప్రారంభం కానుందని, బూత్ కమిటీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడి వరకు ఎన్నికలు జరుపుతామన్నారు.


కొట్టాల రోడ్డులోని టీ షాపు వద్ద ప్లాస్టిక్ కప్పు తింటున్న ఆవు

ప్లాస్టిక్ కప్పు.. ఆవుకి ముప్పు..!

కంప్లి, జనవరి 18(ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ కప్పులు యథేచ్ఛగా ఎక్కడ బడితే అక్కడ పడేస్తున్నారు. వీటిని తింటున్న ఆవులు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇటీవల కొన్ని పశువులు ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్లు తిని మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి. టీ స్టాల్ యజమానులు వ్యర్థాలను తరలించకుండా రోడ్లపైనే పడేస్తున్నారు. పట్టణంలో విచ్చల విడి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, కప్పులు, ప్లేట్లు రోడ్లపై పడేయకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఆటా.. పాటా.. మాదే..!

ఈ ఆట మీకు తెలుసా..?



జల్లిపల్లిలో అచ్చనగాయలు ఆడుతున్న బాలికలు

మంచి ఫోజు ఇవ్వరా..!



రేయ్ మనల్నే ఫొటోలు తీస్తుండారు.. మంచి ఫోజు ఇయ్యల్ల..

లే.. కొడితే గుండు అవతల పడల్ల..!



కూడేరులో గోళీలాట ఆడుతున్న బాలలు

ఊగే ఊగే ఉయ్యాలా..



అనంతపురం హౌసింగ్‌బోర్డు పార్కులో పిల్లలు, పెద్దల సరదా

ఘుమ ఘుమలు..



ఉత్తుత్తి వంటలు.. భలే రుచిగా ఉంటాయి..

స్కూలుకు సెలవు.. అంటే పిల్లలకు పండగే..! ఇంటి వద్ద, వీధుల్లోనూ పగలంతా ఆడిపాడుతుంటారు. మరి సంక్రాంతి సందర్భంగా పదిరోజులు సెలవులు ఇస్తే...! వారి సంబరానికి ఆకాశమే హద్దు. రోజుకొక ఆట, పాటతో మైమరచిపోతారు. రోజులు గంటలు, నిమిషాల్లా వేగంగా గడిచిపోతాయి. అలా ఇప్పటికే పండుగకు ఇచ్చిన సెలవులు తొమ్మిది రోజులు గడిచిపోయాయి. ఈక్రమంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అందుకే ఉన్న ఒక్కరోజును కూడా వదలకుండా పిల్లలంతా కొందరు పెద్దలతో కలిసి సరదగా గడిపేస్తున్నారు. అనంతపురం, కూడేరు ప్రాంతాల్లో శనివారం పిల్లలు ఆడుకుంటుండగా 'ఆంధ్రజ్యోతి' తీసిన చిత్రాలు ఇవి.

నా చేతిలో విష్ణు చక్రం



దారంతో ఆట వస్తువును తిప్పుతున్న బాలిక





రేకుల షెడ్డులో నిల్వ చేసిన గోవా మద్యం, ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి

పట్టుకోండి చూద్దాం..!

- గోవా లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడి సవాల్
- నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసుల ముమ్మర గాలింపు
- కాసింత క్లూ దొరకనివ్వని 'బూసుపల్లి'

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేతనైతే పట్టుకోండి చూద్దాం ..! అంటూ గోవా మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులకు సవాల్ విసిరుతున్నాడు. గత కొన్ని రోజులుగా అతడి కోసం ఎక్సైజ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నా దొరకడం లేదు. గతేడాది డిసెంబరు 9న రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. దీని విలువను ఏపీ మద్యం ధరల ప్రకారం రూ.44 లక్షలుగా లెక్కగట్టారు. అప్పట్లో తొలి రోజు ఐదుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరందరికి ఎక్సైజ్ కోర్టు రిమాండ్ విధించింది. తాజాగా ఆ నిందితులకు బెయిల్ మంజూరైంది.

బూసుపల్లిని పట్టుకునేదెన్నడో..?

గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడి కోసం నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు, హైదరాబాద్, కర్ణాటక, అనంతపురం సమీప ప్రాంతాల్లో గాలించారు. అయితే ప్రధాన నిందితుడు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకోవడంతో సాంకేతికంగా అతడి ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు కష్టమవుతోంది. తన స్థానంలో ఇతరులను నిందితుడిగా చిత్రీకరించేందుకు తొలి రోజుల్లో ప్రధాన నిందితుడు పలు రకాలుగా ప్రయత్నించినట్లు సమాచారం. తన స్థానంలో లొంగిపోయేందుకు కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రధాన నిందితుడి ఫొటో సేకరించడం, మీడియాలో కూడా ఫొటోతో కథనం రావడంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ఇప్పటికే అరెస్టు చేసిన నిందితులతో ప్రధాన నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదన్నట్లు తెలిసింది. అనంతపురంలో తన కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి, మరో ప్రాంతానికి మకాం మార్చినట్లు తెలిసింది. అయితే పాత ఇంటి యజమానికి అద్దె డబ్బులను ఫోన్‌పే చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సెల్ నెంబర్ గురించి ఆరా తీయ గా బయట సాధారణ వ్యక్తిదని తేలినట్లు సమాచారం. ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో సాంకేతికంగా సహకరించాలని జిల్లా ఎస్పీని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కోరినట్లు సమాచారం. ఇతర నిందితులను పట్టుకోవడంలో సక్సెస్ అయిన ఎక్సైజ్ పోలీసులు నెల రోజులు దాటినా ప్రధాన నిందితుడిని అరెస్టు చేయలేకపోవడంతో వారి పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు మద్యం అక్రమ విక్రయాల్లో దిట్టగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు మొదలు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటూ ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డబ్బులు సమకూర్చే వ్యక్తి కోసం గాలింపు

గోవా అక్రమ మద్యం కేసులో మరో కోణంలో ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడికి భారీగా అక్రమ మద్యం కొనుగోలు చేసేందుకు డబ్బులు సమకూర్చే ఫైనాన్షియర్‌ను ఎక్సైజ్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పట్టుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. త్వరలోనే అతడిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. డబ్బులు సమకూర్చే వ్యక్తి దొరికితే గోవా అక్రమ మద్యం కేసులో మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

త్వరలో పట్టుకుంటాం



గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు ముమ్మర ంగా గాలిస్తున్నాం. ఈ కేసులో ఇప్పటికే 8 మందిని అరెస్టు చేశాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన నిందితుడి కోసం ఇతర జిల్లాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టాం. సాంకేతికను ఉపయోగించి ప్రధాన నిందితుడు దొరక్కుండా తప్పించుకుంటున్నాడు. పలు కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఎన్ని వేషాలు వేసినా త్వరలోనే ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డిని పట్టుకుంటాం.

- నాగమద్దయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఎన్టీఆర్‌కు ఎంపీ అంబికా నివాళి

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్‌కు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కేరళ రాష్ట్రం కొచ్చిలోని ఓ హోటల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికాతోపాటు పార్లమెంట్ కమిటీ ఫర్ లేబర్ ఛైర్మన్ బసవరాజ్ బొమ్మై, ఎంపీ హరిష్ బాలయోగి, కమిటీ సభ్యులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ అంబికా

తెలుగు వారి కీర్తి పతాక.. ఎన్టీఆర్: బీకే

పెనుకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగౌరవంగా నిలిపిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కొనియాడారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పార్టీ ఆవిర్భావం తరువాత రూ.2 కిలో బియ్యం, చీర, ధోతి, అందించిన ఘనత రామారావుదేనన్నారు. నివాళులర్పించిన వారిలో జీవీపీ నాయుడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, సుబ్బలక్ష్మమ్మ, దేవానరసింహప్ప, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి తదితరులు

భూములకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సులో రైతులు

యాడికి, జనవరి18(ఆంధ్రజ్యోతి): కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం సేకరించనున్న భూమికి గిట్టుబాటు ధర ఇవ్వాలని అధికారులను పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి శనివారం కమలపాడు, చింతలాయపల్లి, కుందనకోట గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టును 874.70 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కొంత భాగం భూమిని రైతుల నుంచి సేకరించనున్నారు. అవగాహనా సదస్సులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టు ఏర్పాటు వలన ఆయా గ్రామాల ప్రజలకు కలిగే లాభాల గురించి వివరించారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములను ఇచ్చి తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు కూడా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీల వల్ల తమకు ఏమి ఉపయోగం అని వారు అధికారులను ప్రశ్నించారు. భూములకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రాజెక్టుల ఏర్పాటు అంటూ, అభివృద్ధికి సహకరించాలంటూ రైతులను మభ్య పెట్టడం సరికాదని వారు తెలిపారు. కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రాజెక్టుకు కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుగా పేరు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల రైతులు అధికారులకు విన్నవించారు. సమావేశంలో ఏపీ జెన్‌కో ప్రాజెక్టు డీఈ ఆంజనేయులు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగరాజు, ఎస్ఐ వెంకటరమణ, కమలపాడు సర్పంచు కంబగిరిస్వామి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వోలు భీమేశ్వరరెడ్డి, గంగన్న, గ్రామసర్వేయర్ మౌలాలి పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 21న రాచానపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 2004 జనవరి 1 తరువాత జన్మించినవారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9949279330, 9398969691లను సంప్రదించాలని కోరారు.

నేడు ఆర్డీటీ 10కే రన్, 5కే వాక్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు కలెక్టరేట్ వద్ద 10కె రన్, 5కె వాక్ ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు ప్రారంభమై అనంత క్రీడాగ్రామంలో ముగిసే రన్, వాక్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీష్ హాజరవుతారన్నారు. వీరితోపాటు మున్సిపల్ కమిషనర్ వినూత్న, డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లతో పాటు అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మాన్యుయేల్‌లు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

తిరుగు ప్రయాణానికి 54 ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లిన వారు యథాస్థానాలకు వస్తున్న నేపథ్యంలో 54 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లిన వారంతా ఆదివారం నుంచే యథాస్థానాలకు రావడానికి ప్రయత్నిస్తారని, అందుకే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి తదితర నగరాల రూట్లకు 54 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే ఉంటాయని పేర్కొన్నారు. అనంతపురం నుంచి చెన్నైకు రాత్రి 9.30 గంటలకు, చెన్నై నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు, అనంతపురం నుంచి విజయవాడకు రాత్రి 8.30 గంటలకు, విజయవాడ నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు.

భూమిరాంగ్..!

- సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో తొలగింపు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- బ్యాంకర్ల ఒత్తిడితో విలవిల



రత్నమ్మ సాగు చేసిన వేరుశనగ పంట పొలం

కూడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుల భూములను వైసీపీ పాలనలో ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకర్ల ఒత్తిడి ఎక్కువైందని, అధికారులు విచారణ చేసి తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఎన్ని పోరాటాలు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఇదంతా మండలంలోని ఉదిరిపికొండ గ్రామ రైతుల వ్యథ. ఉదిరిపికొండ గ్రామమే కాదు మండలంలోని చాలా రెవెన్యూ గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. 2020 సంవత్సరంలో మండల వ్యాప్తంగా దాదాపు 13 వందల మంది రైతులు భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేయకుండా ఏకపక్షంగా భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో అన్నదాతలు భగ్గుమన్నారు. తాము సాగు చేస్తున్న భూములను ఎలా తొలగించారని అధికారులను ప్రశ్నించారు. అయితే ఇవన్నీ ట్రైనీ కలెక్టర్ తొలగించారని, అప్పటి రెవెన్యూ అధికారులు చెప్పి తప్పించుకున్నారు. అప్పటి నుంచి అన్నదాతలు తమ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదు.

కూటమి ప్రభుత్వంపై ఆశ

రాష్ట్రంలో వైసీపీ పాలనలో భూముల సమస్యలతో అన్నదాతలు సతమతమవుతున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. సమస్యలను అర్జీల రూపంలో రైతుల నుంచి తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తుండటంతో అన్నదాతలకు ఆశలు చిగురించాయి. మండలంలో 13 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలతో అన్నదాతలు 500 వినతులు అందించారు. అత్యధికంగా ఉదిరిపికొండ రెవెన్యూ గ్రామంలోనే 123 అర్జీలు వచ్చాయి. ఆ గ్రామంతోపాటు ఇప్పేరు 91, కల్లగళ్ల 66, తిమ్మాపురం 45, కూడేరు 43, చోళసముద్రం 23, మరుట్ల 21, గొట్కూరు 21, కమ్మూరు 16, కొర్రకోడు 15, జయపురం 14, బ్రహ్మణపల్లి 12, ఎంఎంహళ్లి 10 అర్జీలు అధికారులకు అందించారు. ఎక్కువగా సాగు చేసిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, రస్తా వివాదాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆన్‌లైన్ నుంచి తొలగించిన రైతు ఎరికిల పుల్లప్ప చీనీ తోట

అర్హులకు న్యాయం చేస్తాం

రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. భూములు సాగు చేస్తూ ఆన్‌లైన్‌లో లేకపోతే అలాంటి రైతులను గుర్తించి, ని వేదికలు తయారు చేసి అసైన్మెంట్ కమిటీలో న్యాయం చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూ పి, అర్హులకు న్యాయం చేస్తాం.

- మహబూబ్‌బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దారు, కూడేరు



న్యాయం చేయాలి



నా భార్య నా భార్య షమీనాబాను పేరిట కాంగ్రెస్ పాలనలో భూ పంపిణీ కింద రెండు ఎకరాలకు పట్టాతోపాటు పాసుపుస్తకాలు అందించారు. మరో రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో నాలుగు ఎకరాలు నా భార్య పేరు మీద ఉండేది. అందులో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ, జల్లిపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. వైసీపీ అధికారంలోకి రాగానే మా భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎంత మంది అధికారుల వద్ద మొర పెట్టుకున్న ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

- షేక్షావలి, రైతు, ఉదిరిపికొండ

బయట అప్పు చేసి బ్యాంకు రుణం తీర్చాం

నా పేరున ఉన్న నాలుగు ఎకరాల భూమిలో చీనీ పంట సాగు చేస్తున్న. 2015 సంవత్సరంలో నా పేరు మీద భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. వైసీపీ పాలనలో తొలగించారు. భూమిలో బోరు వేయగా పుష్కలంగా నీరు పడటంతో చీనీ పంట సాగు చేస్తున్నా. భూమిపై బ్యాంకులో అప్పుతీసుకున్నాం. ఆన్‌లైన్ నుంచి భూమిని తొలగించడంతో బ్యాంకర్లు ఒత్తిడి పెట్టారు. దీంతో బయట అప్పు చేసి బ్యాంకు రుణం చెల్లించా. సాగులో ఉన్న మా భూములను ఎలా తొలగించారని రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రశ్నిస్తే, విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు

- ప్రభాకర్, రైతు, ఉదిరిపికొండ



నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సిర్కాజి గోవిందరాజన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సిర్కాజి గోవింద రాజన్ 1933 జనవరి 19న మద్రాస్ ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీతం గాయనంలో పేరొందారు. 'ఇసైమణి', 'సంగీత విద్వాన్' డిగ్రీ పట్టాలు పొందారు. సంగీతంలో తిరుప్పాంపురం స్వామినాథ పిళ్లై వద్ద శిక్షణ పొందారు. ప్రత్యేకించి త్యాగరాజస్వామి కృతుల ఆలాపనలో పేరొందారు. తమిళ, తెలుగు, కన్నడ, మళయాళం భాషలలో వర్ధమాన నటులకు పాటలు పాడారు. ఆయన ఆలపించిన భక్తిపాటలు నేటికీ పండుగలవేళ పాడుతుంటారు. మద్రాస్ యూనివర్శిటీచే గౌరవ డాక్టరేట్ పొందారు. 1988 మార్చి 24న కన్నుమూశారు.

ఎడ్గర్ అల్లన్ పో (జయంతి)



ఎడ్గర్ అల్లన్ పో 1809 జనవరి 19న జన్మించారు. అమెరికాకు చెందిన రచయిత, కవి, సంపాదకులు. యూరప్‌లో సాహితీవేత్తగా పేరొందారు. ప్రత్యేకించి కవితలు, చిన్నకథలు రాయడంలో పేరొందారు. మిస్టరీతో కూడిన ఆయన కథలు ఆసక్తికరంగా సాగుతాయి. అమెరికన్ సాహిత్యంలో శృంగార భావాలతో కూడిన రచనలు, కథలు చేసిన తొలి వ్యక్తి ఆయనే. ప్రస్తుత డిటెక్టివ్, సైన్స్ ఫిక్షన్ కథలకు ఆయనే స్ఫూర్తి. 1849 అక్టోబరు 7న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ 'మిస్టరీ రైటర్స్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో ఏటా ఆయన పేరిట ఎడ్గర్ అవార్డు ఇస్తున్నారు.

డాలీ పార్టన్ (పుట్టినరోజు)



డాలీ రెబెక్కా పార్టన్ 1946 జనవరి 19న జన్మించారు. అమెరికాకు చెందిన గాయని, గేయ రచయిత్రి, బహువాద్య పరికరాల నిష్ణాతురాలు, నటి, రచయిత, వ్యాపారవేత్త. అలాగే మానవతావాదిగాను పేరొందారు. తొలుత సంగీతంలో రాణించి వ్యాపారరీత్యా విజయాలు అందుకున్నారు. 3వేలకు పైగా పాటలను స్వరపరిచారు. ప్రపంచవ్యాప్తంగా ఆమె పాటల సీడీలు అమ్ముడయ్యాయి. 10 గ్రామీ అవార్డులు అందుకోగా 50సార్లు నామినేట్ అయ్యారు. 10దేశాల సంగీత అసోసియేషన్‌లచే అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. డాలీవుడ్ ఫౌండేషన్‌తో విద్య, ఇతర సామాజిక సేవలు అందిస్తున్నారు.



డీసీ కార్యాలయం ఎదుట ఏఐఎంఎస్ఎస్ సభ్యులు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

బళ్లారి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏఐఎంఎస్ఎస్ అఖిల భారత మహిళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పులే 184వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యద్వారానే అవగాహన సాధ్యమవుతుందన్నారు. సావిత్రిబాయి పులే బాలికల కోసం ముఖ్యంగా నిమ్నజాతి బాలికల విద్యకోసం పోరాడి కేవలం 4సంవత్సరాలలో బాలికల కోసం 18పాఠశాలలను ప్రారంభించిందన్నారు. సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి విద్యావతి మాట్లాడుతూ అఖిల బారత మహిళా సాంస్కృతిక సంస్థ తరుపున సావిత్రిబాయి పులే 194వజయతి సందర్భంగా గ్రామంలోని అన్ని వర్గాల మహిళలతో పక్షం రోజులకు ఒక సారి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శులు పద్మ, గిరిజ, సౌమ్య, అభిలాష్ తదితరులున్నారు.

పేదలకు అండగా ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ



వీల్‌చైర్‌ను వితరణ చేస్తున్న సంస్థ సభ్యులు

కంప్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పేదలకు ఎల్లప్పుడూ ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ అండగా వుంటుందని జిల్లా డైరెక్టర్ రోహిత్ ఆక్లా తెలిపారు. కంప్లి పట్టణంలోని మారుతినగర్‌లో బడేసాబ్ ఖాద్రి స్త్రీశక్తి మహిళా గ్రూపులలోని సభ్యులకు, కుమారుడు ఫిరోజ్ పుట్టినప్పటి నుంచి వైకల్యంతో బాధపడుతుండంతో వీల్‌చైర్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామాంజినేయులు, గంగప్ప, ఈరన్న, నాగరాజు, మంజుళ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: యువకుడి మృతి

తాడిపత్రి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నంద్యాలరోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలచంద్ర (26) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ కాలనీకి చెందిన బాలచంద్ర రజకవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన తెలిపాడు. బాలచంద్ర నంద్యాలరోడ్డులోని ఒక ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య భారతి, నాలుగేళ్ల కుమారుడు విక్రమాదిత్ ఉన్నారని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బ్యాంకర్లు సాంకేతికంగా ప్రగతి సాధించాలి

» యూనియన్ బ్యాంకు ఎండీ సీఈఓ మణిమేఖలై



సదస్సులో బ్యాంకర్ల ప్రతినిధులు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు సాంకేతికంగాను ప్రగతి సాధించాలని వినియోగదారుల అవసరాలను గుర్తించడంతోపాటు వారికి ఏ విధమైన వెసలుబాటు సమకూర్చాలనేది కీలకమని యూనియన్‌బ్యాంకు ఎండీ సీఈఓ ఏ మణిమేఖలై అభిప్రాయపడ్డారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలోని యూబీఐ నాలెడ్జ్‌సెంటర్‌లో రెండురోజుల ఇగ్నైట్ 2025, హ్యూమన్ పొటెన్షియల్, హ్యూమన్ రీసోర్స్ కాంక్లేవ్ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన సదస్సును ట్రాన్స్‌ఫార్మింగ్ బ్యాంకింగ్ అనే థీమ్ ప్రకారం ఆర్థిక మంత్రిత్వ కార్యాలయం ఆదేశాలకు అనుగుణంగా జరిపారు. బ్యాంకింగ్, కార్పొరేట్, ఫిన్‌టెక్, నైపుణ్య కేంద్రాలు, హెచ్‌ఆర్, డెవలప్‌మెంట్ విభాగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఆర్థికరంగంలో మానవవనరుల ఉన్నతీకరణపై చర్చించారు. యూనియన్‌బ్యాంకు ఈడీ సంజయ్‌రుద్ర, ఆర్థికసేవా శాఖ కార్యదర్శి నాగరాజు ముఖ్యులుగా పాల్గొన్నారు. బీఐఆర్‌డీ, ఎన్‌హెచ్‌బి, ఐడీఆర్‌బిటి, ఎన్‌ఐబిఎం, ఐఐబిఎఫ్, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు అన్ని బ్యాంకుల ప్రముఖులు పాల్గొన్నారు. అత్యాధునిక డిజిటల్ సాంకేతికతను పాటించడం ద్వారా నిరంతరం కొత్త అంశాలను బ్యాంకర్లు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్‌బ్యాంకు డిజిఎం కనకసుందర్ రామన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం అంజలి భట్నాగర్, యూనియన్‌బ్యాంకు నాలెడ్జ్ సెంటర్ డీజీఎం, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌టి వాసప్ప, బెంగళూరు సర్కిల్ జీఎం నవనీత్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భవననిర్మాణ కార్మికులకోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ప్రత్యేకించి టూల్ కిట్‌లు ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం సభాంగణంలో కార్మికశాఖ ఆధ్వర్యంలో టూల్‌కిట్లను పంపిణీ చేసి మాట్లాడుతూ పేదల కష్టాలకు స్పందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వెల్డింగ్, విద్యుత్ వైరింగ్ తదితర కార్మికులకు కిట్‌లు ఇస్తోందన్నారు. దేశనిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో కార్మికులకు కాన్పు భత్యం, పిల్లల విద్యాభ్యాసానికి సహాయధన, అనారోగ్యానికి శస్త్ర చికిత్స, అవయవ వైకల్యం సంభవిస్తే సహాయధనం, పించను సౌలభ్యం ఇతరత్రా పథకాలు ఉన్నాయని, ప్రతి కార్మికుడికి బీమా సదుపాయం పొందాలన్నారు. కొత్తగా కార్మికమండలిలో నమోదు చేసుకున్న వారికి కూడా అవకాశాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాలూకాలో రూ.2కోట్లతో కార్మికభవనం నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, ఈఓ రవికుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి, కార్మికశాఖ అధికారి రాజేశ్వరి, ఇన్‌స్పెక్టర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ గురువందన



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల బృందం

చింతామణి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పి, జ్ఞానార్జన కల్పించి బతుకుకు బాటలు వేసిన పాఠశాల ఉపాధ్యాయులను ఎన్నటికీ మరువరాదని బీఈఓ ఉమాదేవి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మురగమల్లా గ్రామంలో బొగ్గరం నారాయణశెట్టి ఆదిలక్ష్మమ్మ ప్రభుత్వ హైస్కూల్‌లో 2005-06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులచే శనివారం ఏర్పాటైన గురువందన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గురువుల సేవను స్మరిస్తూ వారికి స్వయంగా ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించిన పూర్వ విద్యార్థుల వైఖరిని అభినందించారు. పాఠాలు చెప్పిన గురువులు ఫలాపేక్ష లేకుండా శిష్యుల భవిష్యత్తును రూపొందించడం ద్వారా జీవనానికి మార్గదర్శకం అవుతారన్నారు. అయితే నేటి విద్యా పద్ధతుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, పిల్లలను దండించకుండా, శిక్షించకుండా పాఠాలు చెప్పాలని పోషకులే సూచిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలతో ముందుకు సాగాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు లక్ష్మినారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నతహోదాలు సాధ్యమని, ఆస్తిపాస్తులకంటే నేర్చుకున్న విద్యయే చివరివరకు ఉంటుందన్నారు. ఏహోదాలో ఉన్నా సమాజ సేవతో రాణించాలన్నారు. మురగమల్లా గ్రామపంచాయతీ అధ్యక్షుడు హాజి అన్సర్‌ఖాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సత్కారం చేసే భాగ్యం లభించడం వారి అభిమానానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్ నరసింహయ్య, ఎం రామకృష్ణ, రమణారెడ్డి, కృష్ణమూర్తి, ఇస్మాయిల్, జబీవుల్లా, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, రాజారెడ్డి, ఈశ్వర్ జే బెన్నూరు, ఎస్‌బి లతా, లావణ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజ యువశక్తి ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్

మహదేవపుర, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బలిజ యువశక్తి ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులు పొందేందుకు, సామాజిక ప్రగతికోసం యువశక్తి ఏర్పాటైందని సామాజికవర్గ ప్రముఖుడు డాక్టర్ త్యాగరాజ అభిప్రాయపడ్డారు. 2ఏ రిజర్వేషన్‌తో బలిజ సామాజికవర్గానికి ఎంతో ప్రయోజనం దక్కిందని, ఎంతోమంది వెనుకబడినవారు ఉన్నారన్నారు. ఐక్యత పెరిగేలా ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 16న శ్రీకృష్ణదేవరాయల 555జయంతి నిర్వహించనున్నట్టు తెలిపారు. వీరేంద్రకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే బలిజ యాప్ విడుదల చేశామన్నారు. సహాయవాణి నెంబరు 95381 00006 ఉందని నిరంతరం పనిచేయనుందని విజయ్ తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్ సురేంద్రబాబు, రాజ్యాధ్యక్షుడు కేటీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వినయ్ కనకనాల్, ప్రధాన కార్యదర్శి సాయి పురుషోత్తమ్, ప్రముఖుడు ఆత్మ రామయ్య, లక్ష్మణ్, నారాయణప్ప, ప్రకాశ్, గజేంద్ర ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ ప్రారంభంలో ప్రముఖులు

రామయ్య ఆసుపత్రితో రోటరీ బెంగళూరు ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరుసంస్థల ప్రముఖులు

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీపీఎల్ కార్డుదారులు, వెనుకబడినవర్గాలకు సమగ్ర వైద్యచికిత్సలు అందించేలా రామయ్య మెడికల్ కళాశాల ఆసుపత్రితో రోటరీ బెంగళూరు గుల్‌మొహర్ ఒప్పందం చేసుకుంది. ఆసుపత్రి అసోసియేట్ డీన్ డాక్టర్ రమేశ్, గుల్‌మొహర్ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ మురళీ కృష్ణలు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. రోటరీ బెంగళూరు సిఫారసు చేసే రోగులకు ఉచితం లేదా రాయితీ సదుపాయం కల్పించేలా నిర్ణయించారు. అనాథాశ్రమాలు, సీనియర్ సిటిజన్లకు ఇన్, అవుట్ పేషంట్లకు ఉచిత వైద్యసేవలు అందించాలని నిర్ణయించారు. ఆసుపత్రి అసోసియేట్ డీన్ డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ దశాబ్దాలకాలంగా రామయ్య ఆసుపత్రిలో కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నామన్నారు. హెల్త్‌కేర్ మిషన్ సహకారంతో ఒప్పందం చేసుకోవడం ద్వారా పలువురికి ప్రయోజనం కానుందన్నారు.

ఆదర్శ పురుషుడు ఎన్టీఆర్

బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నటనలో తెలుగువారి గుండెల్లో నిలిచి రాజకీయంగా పేద బడుగువర్గాలకు ఆదర్శపురుషుడిగా ఎన్టీఆర్ నిలిచారని పార్టీ అభిమానులు అభిప్రాయపడ్డారు. యలహంకలో ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం జరిపారు. నాయకులు పాపణ్ణ, పురుషోత్తమ్, రెడ్డెప్ప, కేశవనాయుడుతోపాటు పలువురు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఎన్టీఆర్ ఫోటోలతో కొత్త సంవత్సరం కేలండర్‌లను విడుదల చేశారు. కాగా మల్లేశ్వరంలోని రఘుపతి ఫౌండేషన్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలువేసి నివాళులు అర్పించారు. అభిషేక్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, రాజేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి అభిమానుల నివాళులు



యలహంకలో అభిమానుల సందడి

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి నెలాఖరుదాకా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పశుఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించి, ఉత్పాదకత పెంచడం, వ్యాధులను నియంత్రి ంచడమే పశు ఆరోగ్య శిబిరాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

ఆఫీస్‌లో గొడవ

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి శనివారం ఫొటోలు తీయడంతో గొడవ జరిగింది. దీంతో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రైవేట్ వ్యక్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారని గతంలోనే నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంగా కొన్ని రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫొటోలు, వీడియాలు తీసేవాడని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. నాసిర్ శనివారం మరోసారి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ప్రైవేట్ ఉద్యోగులు ఉంటుండటంతో ఫొటోలు తీశాడు. దీనిపై అక్కడే ఉన్న కార్పొరేటర్ భర్త రాయల్ మధు జోక్యం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ పంచాయితీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని సబ్‌రిజిస్ట్రార్ యూనస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై చేయి చేసుకున్నట్లు నాసిర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నాసిర్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు.

రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు సాగుతున్నాయని, భద్రతా చర్యలు అందరూ పాటించాలని ర్యాన్ ఇంటర్నేషనల్ అకాడమీ వినూత్నంగా చైతన్యం కలిగించింది. విద్యార్థులు, ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యాసంస్థ ముఖ్యులు ప్రతిమాపటేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్టు వేసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఒకరి నిర్లక్ష్యం మరింతమందికి సమస్య కానుందని సూచించారు. రోడ్డుపై వెళ్తున్న వారికి హెల్మెట్‌ల ప్రాధాన్యతను వివరించారు. రేడియోజాకి అవినాశ్ భరద్వాజ్‌తోపాటు మంజునాథ్, వెంకటేశ్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో విద్యార్థులు

క్యూరాలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కమ్మనహళ్ళిలోని క్యూరా ఆసుపత్రిలో అమ్మ కార్డియాక్‌కేర్ సహకారంతో అత్యాధునికమైన క్యాథటరైజేషన్ ల్యాబ్‌ను చిక్కమగళూరు స్వర్ణపీఠిక అవధూత వినయ్‌గురూజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగనిర్ధారణకు ల్యాబ్‌లు కీలకమన్నారు. సమగ్ర రోగ నిర్ధారణ జరిగితే చికిత్సలు తగిన విధంగా కొనసాగించేందుకు వైద్యరంగంలో ఆధునాతన పరిజ్ఞానం వచ్చిందన్నారు. ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు కెంచప్పగౌడ, క్యూరా ఆసుపత్రుల ఎండీ శ్వేత కె గౌడ, అమ్మ కార్డియాక్ కేర్ నిపుణులు సందీప్ ఎంసీలు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో వినయ్‌గురూజీ తదితరులు

స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం

దొమ్మసంద్ర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్మైల్ ఫౌండేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రద్ధా నేతృత్వంలో మహిళా సాధికారతకు దోహదపడే చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనేకల్ తాలూకాలోని అన్ని గ్రామాలలో ఫౌండేషన్ ద్వారా జాగృతి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకోసం అవగాహన కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా జరుగుతున్నాయని శ్రద్ధా అభిప్రాయపడ్డారు. గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాక తడిపొడి చెత్త వేర్వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం తేవడంపై అభినందించారు. కార్యక్రమంలో చైత్ర, కల్యాణ్, నిరంతర కళాబృందానికి చెందిన విక్రం, శివణ్ణ, మధుశ్రీ, నివేదిత, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాగృతిలో పాల్గొన్న ఫౌండేషన్ పదాధికారులు

సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య


బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రియుడితో గడిపేందుకు భర్త అడ్డుగా ఉన్నాడని సుపారీ ఇచ్చి హత్య చేయించిన భార్య ఉదంతం హాసన్ జిల్లాలో చోటు చేసుకుంది. పక్కా ప్రణాళిక ప్రకారం నంజుండేగౌడ (44) హత్య జరిగింది. చన్నరాయపట్టణ తాలూకాలో శుక్రవారం ఉదయం మరవనహళ్ళి - మడవ రోడ్డులో నంజుండేగౌడ వాహనంపై వెళ్తుండగా మేకులు వేశారు. ఒక్కసారిగా పంక్చర్ కావడంతో వాహనాన్ని ఆపి పరిశీలిస్తుండగానే వచ్చిన దుండగులు మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. చన్నరాయపట్టణ పోలీసులు హత్యకేసును విచారించే కోణంలో భాగంగా పలువురు గ్రామస్తులను ప్రశ్నించారు. భార్యకు వివాహేతర సంబంధం విషయం వెలుగులోకి వచ్చింది. 14ఏళ్లక్రిందట నంజుండేగౌడకు వివాహమైంది. ఇద్దరు కుమార్తెలతో కలసి కుంబారహళ్ళిలో నివసిస్తున్నారు. వీరి ఇంటి సమీపంలోనే ఉండే అరుణ్ అనే వ్యక్తితో వివాహేతరసంబంధం కొనసాగిస్తున్నారు. అరుణ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నా వారికి దూరంగా ఉంటున్నారు. పలుమార్లు వివాహేతర సంబంధంపై గొడవలు జరిగాయి. ఇటీవలే రెండుసార్లు అరుణ్ తరపు వ్యక్తులు నంజుండేగౌడపై దాడి చేశారు. అప్పుడు అదృష్టవశాత్తు తప్పించుకున్నాడు. కానీ రోడ్డుపై గడ్డివేసి వాటికింద మేకులు వేయడంతో గమనించకుండా వాహనం నడపడంతో బైక్ పంక్చర్ అయ్యింది. బైక్ దిగి పరిశీలిస్తుండగా ఒక్కసారిగా దూసుకొచ్చిన దుండగులు కళ్లల్లో కారప్పొడి చల్లి లాంగ్‌లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే కన్నుమూశాడు. భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో సుపారీ ఇచ్చిన విషయాన్ని అంగీకరించినట్టు తెలిసింది. చన్నరాయపట్టణ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మేల్‌మరువత్తూరుకు బయల్దేరిన భక్తులు

శిడ్లఘట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామ పంచాయతీ పరిధిలోని మారపనహళ్ళి నుంచి ఓంశక్తి భక్తులు తమిళనాడులోని మేల్‌మరువత్తూరుకు బయల్దేరారు. భక్తులకు జేడీఎస్ నాయకులు ఉచిత బస్సు సదుపాయం, భోజన వ్యవస్థ కల్పించారు. ఈ సందర్భంగా జేడీఎస్ నాయకులు ఎంఆర్‌జి గంగాధర్, ఎంపీసీఎస్ అధ్యక్షుడు నారాయణస్వామి, ముని వెంకటరాయప్ప, వెంకటేశ్, గంగప్ప, వెంకటప్ప, పూజారి నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు. ఓంశక్తి భక్తులకు స్థానిక నాయకులు ఏదో ఒక విధంగా చేయూత ఇవ్వడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



బస్సు వద్ద భక్తుల బృందం



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.67	1,588.91
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12.011	0
నీటి నిల్వ (టీఎంసీలు)	66.14	10.14

పరీక్షా కేంద్రాల చుట్టూ ఆంక్షలు

● డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపున వివిధ విభాగాల గ్రూప్ బీ పోస్టులకు పోటీ పరీక్షలు 19, 25 తేదీల్లో జరగనున్నాయని, పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల వరకు ఆంక్షలు విధించినట్లు కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ప్రకటించారు. ఆదివారం నగరంలోని 12పరీక్షా కేంద్రాల్లో, జనవరి 25న 11పరీక్షా కేంద్రాల్లో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరవరాదన్నారు. అనధికార వ్యక్తులు, వ్యక్తుల సమూహాలకు ప్రవేశం నిషేధమని ఆదేశించారు. పరీక్షను పర్యవేక్షించేందుకు పనిచేస్తున్న సిబ్బందికి ఈ ఉత్తర్వులు వర్తించవని పేర్కొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతోనే అభివృద్ధి

● జనగణ ఫెడరేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి



బళ్లారి సిటీ,జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక 13జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రంగా పరిగణించాలని మాజీ కార్పోరేటర్, జనగణ ఫెడరేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని స్నేహ సంపుటలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రానికై ఉత్తర కర్ణాటక, మంత్రులు, ఎమ్మెల్యేలను, ఎంపీలు, వివిధ సంఘసంస్థలు మద్దతు ఇవ్వాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ విభజన జరిగింది. అప్పట్లో ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ చిన్నచిన్న రాష్ట్రాలయితే త్వరగా అభివృద్ధి చెందుతాయని ప్రకటించారన్నారు. కర్ణాటకను కూడా విభజిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉత్తర కర్ణాటకాలో సభలు ఏర్పాటు చేసి రాబోవు రోజుల్లో ఉగ్రపోరాటం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పేటే ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పేటే ఆంజనేయ స్వామికి ప్రధాన అర్చకులు శ్యామాచార్య పుష్పాలంకార సేవలు చేశారు. మహామంగళ హారతి చేపట్టారు. భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.



ప్రజల ఆరోగ్యం పట్టదా..?

బళ్లారి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉప లోకాయుక్త అధికారుల తనిఖీల పుణ్యమా అని కేఎస్ఎఫ్‌సీ గోదాముల్లో ఉన్న రూ. 7 కోట్ల విలువ చేసే జొన్నలకు చలనం వచ్చింది. ఏపీఎంసీ మార్కెట్ యార్డు పక్కన ఉన్న గోదాము-1లో సుమారు 40,000 బస్తాలు, 24వేల క్వింటాళ్ల జొన్నలు నిల్వచేశారు. 2023లో రైతుల నుంచి మద్దతు ధరకు కేఎస్ఎఫ్‌సీ ద్వారా కొనుగోళ్లు చేశారు. ప్రభుత్వం వీటిని కేఎస్ఎఫ్‌సీ ద్వారా రేషన్ డిపోల ద్వారా రేషన్ కార్డుల దారులకు అందిస్తారు. కానీ వీటిని రేషన్ కార్డు దారులకు పంపిణీ చేయలేదు. దీంతో అవి గోదాముల్లోనే ఉండిపోయాయి. కేఎస్ఎఫ్‌సీ రాష్ట్రంలో ఆయా ఏరియాల బట్టి పండించే సరుకుల దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్ల చేస్తారు. రాయచూరు, బళ్లారి, కలబురిగి, యాదగిరి, కొప్పళ, ఇలాంటి జిల్లాలో ఎక్కువ మంది జొన్నరొట్టెలు తింటారు. ఇక్కడి ప్రజలను దృష్టిలో ఉంచుకుని జొన్నలు సేకరించారు.

గోదాములను శుక్రవారం రాత్రి ఉప లోకాయుక్త బృందం తనిఖీ చేసింది. ఇంత పెద్ద ఆహార సరుకు ఎందుకు నిల్వ ఉంచారు. ఎందుకు సరఫరా కాలేదు. అని నిషితంగా పరిశీలించింది. వాస్తవానికి జొన్నలు నిల్వ కేవలం 4లేదా 5 నెలకు మించి ఉంచరాదు. ఒక వేళ అలా ఉంచితే పురుగులు పడి పాడవుతాయి. వీటిపై నిలదీసిన లోకాయక్త సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. స్పందించిన అధికారులు ఎట్టకేలకు జొన్నల తరలింపునకు సిద్ధమయ్యారు. గోదాముల్లో మొత్తం జొన్నలను వేరేప్రాంతానికి తరలించారు. రేషన్ డీలర్లు జొన్నల కోసం డీడీ తీయాల్సి ఉంది. అవేమీ చేయకుండానే అధికారులు హడావుడిగా జొన్నలను తరలించేశారు. అయితే శనివారం సాయంత్ర విలేకరుల సమావేశంలో ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప మాట్లాడుతూ జొన్నలు పూర్తిగా చెడిపోయాయి. ప్రజలు తినడానికి వీలు లేదు, అవి తింటే ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. వాటిని పంపిణీ చేయరాదని ఆదేశించారు. మరి పౌరసరఫరాల అధికారులు ఈ జొన్నలను ఏమి చేస్తారు. తాలూకాల్లో ఉండే గోదాముల్లో నిల్వ చేస్తారా..? లేదా ఏదోలా రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



గోదాముల్లో ఉన్న జొన్నలను లారీకి లోడ్ చేస్తున్న దృశ్యం

పిల్లలతో మరుగుదొడ్లు కడిగిస్తారా..?

● హాస్టల్ వార్డెన్‌పై డిప్యూటీ లోకాయుక్త ఆగ్రహం ● బియ్యంలో పురుగులపై మండిపాటు ● సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

బళ్లారి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పిల్లలతో మరుగుదొడ్లు కడిగించడంపై లోకాయుక్త అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మయూర హోటల్ వెనుక ఉన్న షెడ్యూల్డ్ కమ్యూనిటీ విద్యార్థుల హాస్టల్లో శనివారం ఉదయం నాసిరకం భోజనం సహా పలు సమస్యలను పరిశీలించిన డిప్యూటీ లోకాయుక్త బి.వీరప్ప వార్డెన్ శేఖన్నను సస్పెన్షన్‌కు ఆదేశించారు. హాస్టల్లో మరుగుదొడ్లను పిల్లలే స్వయంగా శుభ్రం చేయించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులపై ప్రశ్నించగా ఆయన సమాధానం ఇవ్వలేదు. హాస్టల్లో నిల్వఉంచిన ధాన్యం, బియ్యం, సేమియాలో పురుగులు ఉండడం చూసి లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అలాంటి ఆహారం ఎలా ఇస్తారని అన్నారు. పిల్లలకు పాలు తక్కువ మోతాదులో ఇస్తున్నారని ఫిర్యాదు అందిందని తెలిపారు. పక్కనే ఉన్న కాలేజీ స్టూడెంట్స్ హాస్టల్‌ని తనిఖీ చేస్తే అక్కడి విద్యార్థులు వారానికోసారి వార్డుకు వస్తుంటారు. మీరు వచ్చినందుకు రెండ్రోజుల నుంచి భోజనం బాగా పెడుతున్నారని, నీటి కొరత, బియ్యంలో పురుగులో, కంపు కొట్టే మాంసమే వడ్డిస్తారని వాపోయారు. వేడి నీటి వ్యవస్థ కూడా లేదన్నారు. హాస్టల్ దుస్థితిపై ఉప లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మనుషులేనా.. మీకు మానవత్వం లేదా అంటూ గద్దించారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న లోకాయుక్త బృందం

దేవదాసీలకు ఇంటి స్థలాలివ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

తోరణగల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేవదాసి మహిళలకు నివేశన స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తోరణగల్లు కర్ణాటక రాజ్య దేవదాసి మహిళ విమోచన సంఘం పదాధికారులు, ప్రతిఘటన సండూరు తాలుకా తోరణగల్లు గ్రామ పంచాయతీ ముందు శనివారం ఆందోళన చేపట్టారు. మహిళ విమోచన సంఘం పదాధికారులు స్వామి దుర్గమ్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని, ఇప్పటికైనా సొంతింటి సౌకర్యం కల్పించాలన్నారు. పెరిగిన అద్దెలు చెల్లించలేకపోతున్నామని, నాయకులు తమ బాధలు అర్థం చేసుకోవాలన్నారు. పంచాయతీ బిల్ కలెక్టర్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం పదాధికారులు ఏ స్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హెచ్ స్వామి, సుంకన్న, మరియమ్మ, బసమ్మ, సుశీలమ్మ, మారెమ్మ, మహిళలు పాల్గొన్నారు.

పర్యాటక స్థలాలతో అపారజ్ఞానం



బస్సులకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, జనవరి 18(ఆంధ్ర జ్యోతి): పర్యాటక స్థలాల సందర్శనతో విద్యార్థులకు అపారమైన జ్ఞానం కలుగుతుందని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. శనివారం విద్యాయాత్ర బస్సుకు ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ చిత్తయ్య, కాంగ్రెస్ నాయకులు కరిబసప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డీఎంఏ రాక..?

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) హరి నారాయణ ఆదివారం నగరపాలికకు రానున్నట్లు తెలిసింది. నగరంలోని ప్యాచ్‌వర్క్‌లను ఆయన పరిశీలించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కడప జిల్లాలో ఉన్న డీఎంఏ ఆదివారం రావచ్చని లేదా మరో మున్సిపాలిటీని సందర్శించే అవకాశం ఉందని తెలిసింది.

అవినీతిని సహించేది లేదు

● ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప



మాట్లాడుతున్న ఉపలోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప

బళ్లారి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలో రాష్ట్ర ఉప లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బి. వీరప్ప నేతృత్వంలో మూడు రోజుల పాటు విస్తృత తనఖీలు చేపట్టారు. చివరి రోజు అయిన శనివారం ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో డి.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో మొత్తం 274 కేసులు ఉన్నాయన్నారు. వీటిలో 87 కేసులకు సంబంధించి ఫిర్యాదుదారులు, ప్రత్యర్థులతో సమక్షంలో విచారణ చేసి కేసులు పరిష్కరించామన్నారు. జనవరి 16 నుంచి 18 వరకూ మూడు రోజుల పాటు బళ్లారి జిల్లాలో ఉప లోకాయుక్త పర్యటించి పలు కేసులను పరిష్కరించడంతో పాటు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చామని తెలిపారు.

జనవరి 16 న ఏపీఎంసీ మార్కెట్, వేనివీరాపురం వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్ డిస్పోజల్ ప్లాంట్, బళ్లారి నగర పాలికె కార్పొరేషన్, తాలూకా కార్యాలయం, జిల్లా ఆసుపత్రి, 100 పడుకల మాతా శిశు, నియోనాటల్ ఆసుపత్రి, బిమ్స్ ఆసుపత్రి, ఆర్టీవో కార్యాలయం, జిల్లా జైలు పరిశీలించామ్నారు. 17న కేఐడీపీ జోన్, అనంతపురం రోడ్డులోని వివిధ అభివృద్ధి పనులు, కేఎఫ్ఎస్‌సీ కార్పొరేషన్, తనికీ చేసినట్లు తెలిపారు. 18న సంక్షేమ హస్టళ్లు, ప్రభుత్వ రెసిడెన్షియల్స్ పాఠశాలలు, వివిధ హస్టళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రజలు ఇబ్బంది పడుతకుండా ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు లోకా యుక్త సిద్ధంగా ఉందన్నారు. తనిఖీ చేసిన చోట అనేక అంశాలు గుర్తించామని వారికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన బాలింతల మరణం పై సుమోటా కేసుకింద పరిగనిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాలో పర్యటిస్తామని ప్రస్తుతం బళ్లారితో పాటు 3 జిల్లాలు పూర్తి చేశామన్నారు. ప్రధానంగా అవినీతి లేని సమాజం నిర్మాణం కోసం లోకాయుక్త పనిచేస్తుందన్నారు. గాంధీ, నెహ్రూ, బాలగంగాధర్ తిలక్, అబెడ్కర్ ఇలాంటి వారు మన భారత దేశ సంపద అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.

నేడు జగద్గురు భారతీతీర్థ స్వామి రాక

● భారతీ తీర్థ భవన్‌ను ప్రారంభించనున్న స్వామీజీ



ముస్తాబైన భారతీ తీర్థ సభ భవన్

బళ్లారి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పలు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శృంగేరి పీఠంలోని జగద్గురు భారతీతీర్థ స్వామి ఆదివారం సాయంత్రం నగరానికి రానున్నారు. నగరంలోని సంగనకల్లు రోడ్డు శ్రీ శృంగేరి శారద శంకర మఠంలో ఆర్ట్ సిస్మటమ్, మఠం మాడరేటర్ టీకే బీఎన్, మూర్తి నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు చేశారు. 19, 20, 21తేదీల్లో మూడు రోజుల పాటు నగరంలో స్వామి బస చేయనున్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని కేఆర్ఎస్, ఫంక్షన్ హాలు నుంచి శంకరమఠం వరకు కుంభ కళశంతో ఊరేగింపుగా స్వాగతం పలుకుతారు. అనంతరం స్వామీజీ ఆడిటోరియం ప్రారంభిస్తారు. 20న నగరంలోని ఆరాధ్యదైవం మల్లేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి అనంతరం సభాపతి వీధిలోని పాత శంకర మఠానికి చేరుకుంటారు. స్వామీజీ ప్రజలకు దర్శనం ఇచ్చి, భక్తుల నుంచి హారతి తీసుకోనున్నారు. సాయంత్రం మఠంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమంలో మహిళలు, చిన్నారులచే శ్లోకాలు పఠిస్తారు. అనంతరం స్వామి ఆశీర్వచనం, చంద్రమౌళీశ్వర స్వామి పూజలు నిర్వహిస్తారు. అదే సమయంలో ఆదిశంకరాచార్య 20 వేల విరచిత శ్లోకాల పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. 21న భక్తుల ఇళ్లకు వెళ్ళి సేవను స్వీకరించి శిష్యబృందానికి ఉపదేశం చేయనున్నారు.

విద్యుత్ దీపాల అలంకరణలో మఠం

మఠం ఆవరణలో నిర్మించబడిన ఈ భవన్‌లో ఆకర్షణీయమైన వేదిక, 800మందికి కూర్చోవడానిక ఏర్పాట్లు, వంటగది, 650 మందికి భోజన వసతితో కూడిన 28గదులు , పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ నిరంతరాయంగా యూపీఎస్‌తో విద్యుత్ కనెక్షన్‌ఉంది. జనరేటర్ సిస్టమ్, సౌండ్ సిస్టమ్,ఎలక్ట్రిక్ డెకరేషన్లు, వంద ద్విచక్ర వాహనాలు, పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

హోసూరు జోన్

నగరంలో ముచ్చుకోతి హల్‌చల్

హోసూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హోసూరు జిల్లా కమిషనర్ కార్యాలయంలో ఓ ముచ్చుకోతి హల్‌చల్ చేసింది. అటవీ ప్రదేశంనుంచి దారి తప్పి వచ్చిన ముచ్చుకోతిని తిరిగి అడవుల్లోకి పంపాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వీటిని లంగూరు కోతులు అని కూడా పిలుస్తారు. సరిహద్దున కర్ణాటక రాష్ట్ర అటవీ ప్రాంతాలకు సమీపాన ఉండడంతో అడవి జంతువులు ఆహారం, నీరు వెతుక్కుంటూ రెండు రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాల మధ్య సంచరిస్తూ ఉంటాయి. ముచ్చుకోతి హల్‌చల్ చేయగా కొందరు దీంతో సెల్ఫీలు, ఫోటోలు తీసుకున్నారు. కాగా దీన్ని చూసి వీధికుక్కలు వెంబడించడంతో వాటి బారిన పడకుండా స్థానికులు రక్షించారు. దారి తెలియక వచ్చిన ముచ్చుకోతిని అటవీ అధికారులు రక్షించాలని కోరుతున్నారు.



కార్యాలయంలోకి వచ్చిన ముచ్చుకోతి



నాట్య ప్రదర్శన

ఉత్సాహంగా నాట్యాంజలి

హోసూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హోసూరు భారతీదాసన్ నగర్‌లోని కల్యాణకామాక్షీ అమ్మ ఆలయంలో నాట్యాంజలి కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. తమిళుల త్రైమాసం శుక్రవారాన్ని పురష్కరించుకుని ఆలయంలో కొలువైన కల్యాణకామాక్షీ అమ్మ వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారులు యోగేష్ కుమార్, స్నేహా నారాయణన్ ఆధ్వర్యంలో బాలికలతో నాట్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. వివిధ స్థాయిలలో కళాకారులు భరత నాట్య నృత్యాన్ని ప్రదర్శించారు. ఇద్దరు నృత్య ఉపాధ్యాయులతో పాటు 18 మంది భరతనాట్య కళాకారులు వివిధ అభినయాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. భరతనాట్యంలో పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు నాట్య కళామణి, నాట్య మయూరీ, నాట్యమణి, నాట్య జ్యోతి, నాట్యపుష్ప వంటి ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పెద్ద సంఖ్యలో వీక్షించి విద్యార్థులను ప్రశంసించారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధన మహోత్సవం



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

హోసూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హోసూరు కామరాజకాలనీలోని ఆంధ్రసాంస్కృతిక సమితిలో నాదబ్రహ్మ త్యాగరాజస్వామివారి 178వ ఆరాధన మహోత్సవము శనివారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం నుంచి వివిధ బృందాల కళాకారుల ప్రదర్శనలు సాగాయి. మంగళవాద్యాలతో ప్రారంభమైన ఆరాధన మహోత్సవంలో డిఎంజయరామ్, వి.జగదీశ్, డోలు బృందం నవీన్‌కుమార్, నాదస్వరం, ఎస్.యశ్వంత్, ఆంధ్ర సాంస్కృతిక సమితి సంగీత కళాకారులు విద్వాన్ ఎం.దేవరాజు, శిష్య బృందంచే గానగోష్ఠి, త్యాగరాజు కీర్తనలు, పంచరత్న కీర్తనలు, బృందగానం ఆలపించారు. కళాకారులను సత్కరించారు. సంగీతంలో త్యాగరాజస్వామి సేవలను వక్తలు కొనియాడారు. పెద్దసంఖ్యలో కళాభిమానులు, సంగీత ప్రియులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



బృందగానంలో విద్యార్థులు

అన్నం పెట్టిన మహనీయుడు

బళ్లారి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు పేద ప్రజల కోసం పుట్టిన దేవుడని.. ఎందరో పేదల ఆకలి తీర్చిన మహనీయుడని కమ్మసంఘం నాయకులు ప్రశంసించారు. రైతు కుటుంబంలో పుట్టి, సినిమాల్లో నటించి.. రాజకీయంగా ప్రజలకు దగ్గరయిన దివంగత నందమూరి తారక రామారావు ఇప్పటికీ ఆయన ప్రజల గుండెల్లో జీవించే ఉన్నారని, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు, ఇతర దేశాల్లో కూడా ఎన్టీరామారావు అభిమానులు ఆయన్ను మరవలేరని బళ్లారి జిల్లా కమ్మమహాజన సంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూఫ్ కుమార్ అన్నారు. శనివారం ఎన్టీరామారావు వర్ధంతిని బళ్లారిలోని కమ్మభవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనూఫ్ కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కమ్మమహాజన సంఘం సెక్రటరీ దామోదర్ చౌదరి, కో-శాకాధికారి జీ. ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్ బాబు ప్రకాష్, ఎన్టీఆర్ అన్నక్యాంటీన్ అధ్యక్షుడు గుర్రం లాల్‌మోహన్, బళ్లారి మేయర్ నందీష్ బాబు, ధర్మవరం చిన్నయప్ప, వెంకటనాయుడు మాట్లాడారు. వీరితో పాటు అమరనాథ్ చౌదరి, చంబలి ప్రకాష్, సుబ్బరాయుడు ఆంజనేయులు, టి. సురేష్, పార్థసారథి, అలివేలు సురేష్, టీ. ఎర్రిస్వామి, వై. శ్రీనివాసులు, జయప్రకాష్, బీమినేని ప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ధర్మవరం చిన్నయప్ప

ఆసుపత్రిలో అన్నదానం

బళ్లారిలోని ట్రామాకేర్ ఆసుపత్రి వద్ద ఎన్టీఆర్ అన్నక్యాంటీన్ ఏర్పాటు చేశారు. అక్కడ రోగులకు, బంధువులకు అన్నదానం చేశారు. అన్నదాన క్యాంటీన్ నిత్యం కొనసాగుతుందని అన్నక్యాంటీన్ అధ్యక్షుడు గుర్రం లాల్ మోహన్ తెలిపారు. పేదల సౌకర్యార్థమే అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. అంతక ముందు ఆస్పత్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కళ్యాణ్‌రామ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

బళ్లారి రూరల్: నందమూరి కళ్యాణ్‌రామ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఉలిగప్ప నేతృత్వంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అప్పయ్య, మంజు, వన్నూరు, మహేష్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అభిమానులు